# అహం (కారణం)

అప్పుడే జైలు నుండి విడుదలైన ఖైదీల్లా - కిటికీ ఊచల్లోంచి చొచ్చుకొచ్చిన సూర్యకిరణాల స్పర్శకు చెంప చురుక్కుమంది. నిండా దుప్పటి కప్పుకుంటేసరి... ఎండ తిక్క కుదుర్చాలని దుప్పటి మొహాన్ని కప్పేసింది. ఐదు నిముషాల్లో దుప్పటి వేడెక్కింది. వేడెక్కిన దుప్పటి రెండు చెంపలకు చురుకంటించింది.

కిటికీ తలుపులు మూసేస్తేసరి....చటుక్కున మూసుకున్నాయి. మరో ఐదు నిముషాల్లో ఉక్క...ఒకటే ఉక్క; ఫాను వేసి స్పీడు పెంచితేసరి... ఫానురెక్కలు విదిలించి స్పీడందుకుంది. కొద్ది సేపట్లో... ఫానుగాలి వేడి నిట్టూర్పులు విడిచింది. ఒళ్ళంతా చెమట.

నిద్రాదేవి కౌగిలి విడిచి లేవాలొస్తున్నందుకు ఎంతో బాధ, ఆత్మీయులెవరో అతిగతీ తెలీకుండా పారిపోయినంత బాధ.

గోడ గడియారం తొమ్మిదిసార్లు దగ్గింది.

అప్పుడే తొమ్మిదైందా.... లేచి ఒళ్ళు విరుచుకుంది సునీత. నిద్రమత్తు - ఎడబాటు సహించలేనంటుంది. మెల్లిగా లేచి నిలువెత్తు అద్దంముందు నిల్చుంది - అవులిస్తూ.... గుండ్రని మొహం.... దబ్బపండు ఛాయ, పాలరాతి చెక్కిళ్ళు.... మొగిలి పూవులగుత్తిని చుట్టేసిన నల్లతాచులా - పొడుగాటి జడ.... నైటు గౌనులో ఒదిగి ఉండలేని అందాలు ... కళ్ళు ఎర్రగున్నా యింకా - మత్తుగా గమ్మత్తుగా వుంది.

నిన్నరాత్రి.... క్లబ్ వార్షికోత్సవం ఎంతబాగా జరిగిందనీ....

చుక్కల పందిరిలా - సీరియల్ బల్బులతో అలంకరించిన నాలుగ్గోడలమధ్య పాటలూ.... డాన్సులూ - జోక్స్.... ఆడామగా తేడాలేని సమ సమాజం సాంప్రదాయం కట్టుబాట్లు కట్టగట్టి, తుంగలో తొక్కిన మధుర క్షణాలు విస్కీసిప్ చేస్తూ ... ఎవరికి నచ్చినవారి కౌగిట్లో వారు- హాయ్‌గా ఎంజాయ్‌గా....

ఔనూ డ్రింక్స్‌కంటే ముందు అవిడెంత బాగా పాడింది! అందంగా అమాయకంగా కన్పించే- ఆవిడగొంతులో ఎంత మార్దవం! పాట వింటున్నంతసేపు ఊహాలోకాల్లో తేలిపోయా రంతా. డాన్స్‌లు మానేసి పాటలో కరిగిపోయారు.

ఆవిడెవరూ? ... ఎవరూ .... అం...సుగుణ. బహుశ - గుణానికి తగిన పేరయ్యుంటుంది.

ఆ పాట తననెందుకంత ఆకర్షించింది? తనెందుకంత ఇదై పోయింది? సుగుణ రోజూ క్లబ్బుకురాదు. వార్షికోత్సవానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. పాటపాడి-స్టేజీ దిగిన సుగుణను కౌగిలించుకోవాలన్పించింది. అంతపనీచేసి.

"బాగా పాడారండీ" అంది తను. సంతోషం పట్టలేక.

"అదంతా మీ అభిమానమండీ."

"కాదు.. కానేకాదు...మీది కోకిల కంఠం"

"బాగా పొగిడేస్తున్నారు, మరి మీరు..."

"నా పేరు సునీత. ఈ క్లబ్ పుట్టిన్నుంచీ సభ్యురాల్ని"

"ఐతే ఈ క్లబ్ గిట్టేదాకా సభ్యత్వం వదులుకోరన్న మాట!" నవ్వులో నవరత్నాలొలికాయి.

# 3

చాలా సేపు మాట్లాడుకున్నారిద్దరూ. సుగుణ తనకు బోలెడంత మానసికానందం చేకూర్చింది. ఆ కొద్ది సేపట్లో ఆత్మీయత అంటే ఏమిటో తెలిసిపోయింది. డ్రింక్స్ రాగానే-అలవాటు లేదని మర్యాదగా వెళ్ళిపోయిందావిడ. వెళ్ళేముందు

"రేపు మధ్యాహ్న భోజనానికి మా ఇంటికిరండి- ప్లీజ్!" అంది. తను తటపటాయిస్తుంటే "మీ సోదరి లాంటి దాన్ని ... ఎందుకలా సందేహిస్తున్నారు? పదకొండు నుండే మీ కొరకెదిరి చూస్తుంటాను" ఒప్పించి, అడ్రస్ కాయితమిచ్చి సెలవు తీసుకుంది.

ఊహ తెలిసినప్పట్నుంచి ఎవ్వరూ తనతో అలా మాట్లాడలేదు. అంతరంగం కరిగి అనుబంధమేదో రంగరించుకుంది.

ఒక్కగానొక్క కూతురనీ, కొడుకుల్లేరనీ గారాబంగా పెంచి కోట్ల ఆస్తి అప్పగించి, మరో లోకంలో కెళ్ళిన అమ్మానాన్నలు- మనసులో మెదిలారా క్షణాన.

గత ఐదేళ్ళ అనుభవం-అందరికీ తన ఆస్తి, ఒళ్ళు మాత్రమే కావాలి. పెత్తనాన్నెవ్వరూ సహించరు. కాస్త గట్టిగా మాట్లాడితే కసురుకుని చీదరించి వెళ్ళారు. కొందరు యువకులు ప్రేమిస్తున్నామని ఆరాధ్య దైవమని ఇంకేదేదో అన్నారు. వాగ్ధాటికి తట్టుకోలేక వచ్చినదారి పట్టేశారు. ఏమిటో లోకం-విచిత్రంగా తోచింది.

"ఊవిణ్ణి చేసుకుంటే జన్మాంతరం దాసానదాసుడిగా సేవలు చెయ్యాలి...."

"పెళ్ళాం కంటికి అద్దంలా, కాలికి చెప్పులా అణిగిఉండే ఖర్మ నాకొద్దు".

"ఆవిడ చీరలుతుకుతూ, సేవలు చేస్తూ తరించే పత్నీవ్రతుడెవడుంటాడూ!"

"చీమునెత్తురున్న వాడెవ్వడూ అందుకంగీకరించడు".

తన మొహమ్మీదే మాటల బాణాలు విసిరి వెళ్ళిపోయారు.

సమయం దొరికితే తననోసారి లోబరచుకోవాలనే చూచారుగాని....అక్కున చేర్చుకుని లాలించగలరనే నమ్మకం ఎవ్వరూ కల్గించలేదు.

"పెసరట్టు-ఉప్మా టిఫిన్ తయారు చేశానమ్మా, మధ్యాహ్న భోజనానికేం కూర చెయ్యమంటారు?" వంట మనిషి రాజేశ్వరమ్మ అడిగింది-వినయంగా.

• • • • •

"....ఇల్లు చాలా నీట్‌గా ఉంచారండీ! అందుకే అన్నారేమో-ఇల్లు చూచి ఇంటి ఇల్లాలు గుణగణాల్ని పోల్చుకోవచ్చని."

నిరాడంబరంగా, అందంగా అలంకరించబడున్న సుగుణ ఇంటి వాతావరణం బాగా నచ్చింది సునీతకు. ఇల్లు చిన్నదైనా-అలాగనిపించలేదు.

"మీ అభిమానమలా పొగడేస్తుందిగానీ-ఇదంతా మామూలేకదండీ. ఐనా మీలాంటి కోటీశ్వరుల ఇళ్ళలాగా ఉండవు గదండీ మా సామాన్యుల ఇళ్ళు. కూచోండి, కాఫీతెస్తా" నని లోపలికెళ్ళింది సుగుణ.

## 5

కోటీశ్వరులు హుఁ! కోట్ల కొద్ది డబ్బు ఏంచేసుకోను? డబ్బుతో ప్రేమ దొరుకుతుందా? అభిమానం కొనుక్కో వచ్చా? మూర్ఖంగా పోగొట్టుకున్న బెటర్‌హాఫ్‌ని తిరిగి ఇప్పిస్తుందా? కళ్ళు తెరచిన...గత ఐదు సంవత్సరాల నుండి తాననుభవిస్తున్న మనో క్షోభను చల్లారుస్తుందా?– ఓ వేడి నిట్టూర్పు తోసుకొచ్చింది.

"అమ్మా... అమ్మా" ఐదారేళ్ళ కుర్రవాడు వెనుక నుంచి పరుగెత్తుకొచ్చి సునీతను చుట్టేశాడు.

"ఎవరు బాబూ?: అందుకోబోయింది షాక్ తగిలినట్టు విడిపోయి.

"మా అమ్మేదీ...లోపలుందా?: తుర్రుమన్నాడు.

"ట్యూషనై పోయిందా బాబూ?"

"ఐపోయిందమ్మా! అక్కడ కూచున్న దెవరమ్మా?" లోపలి సంభాషణ వినపడుతూంది సునీతకు.

ఈ అబ్బాయినెక్కడో చూచి నట్టుంది. ఎక్కడా? ఎక్కడో... చాలా దగ్గరున్నించి చూచినట్టుంది ఎంత బావున్నాడు!

ప్చ్! నా బాబుగూడా ఇంతవాడవచ్చు.

జీవితమిలా ఎండమావిగా ఎందుకు తయారైంది? కట్టుకున్నవాడు, కడుపు పేగులు తెంచుకు పుట్టిన వాడెందుకు దూరమయ్యారు తనకు?

◆ ◆ ◆

"నువ్విలా పార్టీలకూ, పిక్నిక్‌లకూ, షికార్లకూ బలాదూర్‌గా తిరగొద్దని లక్షసార్లు చెప్పాను గదా! బయట నేను తలెత్తుకు తిరగలేకపోతున్నాను. ఉబికివచ్చే కోపాన్నెలా వ్యక్తం చేయాలో నిర్ణయించుకోకముందే అనేశాడు రఘురాం.

"ఏ సరదాలూ లేకుండా ఇంట్లో పడుండడం నాకుచేతగాదని లక్షలసార్లుచెప్పాను. మీలా నేనో చిరుద్యోగినా సరదాల్ని చంపుకునేందుకు." సునీత మొహం మంకెన పూవైంది. కళ్ళల్లో ఎర్రజీర నాట్యమాడింది.

"నువ్వు నా భార్యవు. ఇంటి ఇల్లాలివనే సంగతి మరిచిపోకు"

"ఐతే మాత్రం వంటింటి కుందేలులా, పడకటింటి తోలుబొమ్మలా పడుండాలా? నాకేం తక్కువైందని మీ చెప్పుచేతుల్లో మెదలాలి? నాతో పాటు మీరుగూడా తిరగండనీ, ముష్టి పదమూడొందల సర్కారీచాకిరీ నొదిలి పెట్టండనీ ఎన్నిసార్లు మొత్తుకోలేదు? మీ కెందుకంత జెలసీ? మరోమాట-నేను మీ ఇంటి ఇల్లాలుగా రాలేదు. మీరే ఇంటి భర్తగా వచ్చారన్న సంగతి మరువకండి. నా ఆస్తికి ఆశపడి నా జీవితాన్ని చుట్టేశారు" ముక్కు పుటాల్లు వేడిగాలులతో దుల్తుంటే గుండెలెగిరి పడ్తున్నై.

"చూడు సునీతా! మన పెళ్ళి పెద్దల నిర్ణయంతో వారి చేతులమీదుగా జరిగింది. ఆత్మాభిమానం అమ్ముకుని నేను నిన్ను పెళ్ళాడలేదు. నా హద్దులేమిటో, బాధ్యతలేమిటో నాకు బాగా

తెలుసు. నేనవి మరచిననాడు గుర్తుచెయ్. సంతోషిస్తాను. కాని భార్యగా నీ పరిధి ఏమిటో, బాధ్యత లేమిటో తెలుసుకో! నువ్వో ఇల్లాలివేకాదు. మన బాబుకు తల్లివి గూడా. ఆర్నెల్ల కుర్రాడిని ఆయాకొదిలేసి నీమానాన నువు తిరగడం నాకసలే నచ్చదు'' అను నయం, పట్టుదల, అభిమానం ముందుకు తోస్తున్నాయతణ్ని.

''కావాలంటే ఉద్యోగం మానేసి మీరుండండి ఇంట్లో బంగారంలాంటి ఫ్రెండ్స్ సర్కిల్, అనుభవించే వయస్సు మళ్ళీ రమ్మంటే వచ్చేనా? మూర్ఖపు భావాల్తో నేనేకీభవించను'' చంద్ర కాంతమణుల్లా మెరిసే కళ్ళల్లో నిర్లక్ష్యం తాండవిస్తుంది.

''సునీత!'' గొంతు స్థాయి హెచ్చింది అభిమానం దెబ్బతినడంతో ''చివరిసారిగా చెబుతున్నా. ఎన్నో ఆశల్ని, ఆశయాల్ని మూటగట్టుకుని, కన్న కలల్ని పండించుకుందామని, ఒకరి జీవితాన్నొకరం పంచుకున్నాం, పైపై మెరుగుల ప్రపంచాన్ని విచక్షణా రహితంగా చూస్తే అనర్థం తప్పదు. నువ్వు నీ ప్రవర్తన మార్చుకోకపోతే నేను నా ప్రవర్తన మార్చు కుంటాను,''

''అంటే..''

''నా బాబును తీసుకుని నీ ఇంట్లోంచి వెళ్ళిపోతాను''

తన దాంపత్యం తీగలుగా సాగి ఆకులు తొడిగి పుష్పించి ఫలిస్తుందనుకుని భంగపడిన రఘురాం మాటల్లో ధృఢ నిర్ణయం-సునీతనేమీ కరిగించలేదు.

విరగబడి పకపకా నవ్వేసింది. ఆ నవ్వులో కర్కశం;

గర్వం సమ పాళ్ళలో చోటుచేసుకున్నాయి.

"అలాగైతే నీదే ఆలస్యం రఘురాం! పీడా విరగడై పోతుంది" ముక్కుకోసేసినంతకోపంగా మాటల్ని ఒత్తిపలికింది. హాండ్ బ్యాగును ఆలవోకగా తిప్పుతూ బంగళాపై కెళ్ళింది సునీత. బాబునెత్తుకుని బయటికెళ్ళి పోయాడు రఘురాం.

◆ ◆ ◆ ◆ ◆

ఆరోజే తలంటు పోసుకుందేమో-పట్టుకుచ్చుల్లాంటి జుట్టును వెనకాల ముడేసి కొసలు వదిలేసింది సుగుణ. సాదాసీదాగా ఉంది కాఫీ కప్పందిస్తూంటే అవిడ కళ్ళల్లో చురుకుదనం తళుక్కుమంది.

"బాబు.... బొద్దుగా ఉన్నాడండీ!" అంది సునీత. ఖరీదైన ఆవిడ దుస్తుల్లోంచి అవయవాల పొంకం కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

"ఔనండీ! నా భాగ్యమో....వాడి అదృష్టమో! వాడు నా కొడుకైనాడు'

"అంటే మీరు కన్నకొడుకు కాదా?"

"కాదు, మావారు కన్నకొడుకు"

"అంటే...." సునీత కను బొమ్మలు విస్మయంగా ముడిపడిపోయినై.

"మా వారికి నేను రెండో భార్యను, నాకు వారు రెండో భర్త!"

"అదెలాగైందీ?"

"పెళ్ళయి మూడు రాత్రుల ముచ్చట తీరకముందే నా మొదటి భర్త ఆక్సిడెంటులో పోయాడు. ఒక అబ్బాయిని కన్న మావారి మొదటి భార్య అహం నెత్తికెక్కి వారి నొదిలేసిందట. బాబుతో వారు బయటికి రాగానే విడాకుల నోటీసు పంపించిందట. దేవుడులాంటి భర్తను, కడుపు చించుకు పుట్టిన కొడుకునూ వదిలేసిన ఆ దురదృష్టవంతురాలెవరో గాని–నాకు మాత్రం మరువరాని మేలుచేసింది"

"ఐతే ... ఈ బాబూ ..!?"

"ఆవిడ బాబే కాని వాడిప్పుడు నా కంటిపాప. దిక్కూ దివానం లేక అల్లాడిపోతున్న నన్ను చేరదీసి జీవితం మీద మళ్ళీ ఆశలు కల్పించిన మా వారి ఆశాదీపం వీడే"

"మీ పెళ్ళయి ఎన్నాళ్ళైంది?" సునీత అంతరంగం కల్లోలమైంది.

"....నాల్గు సంవత్సరాలైంది. పెళ్ళి కాగానే నేను ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను—మా వారొద్దని వారించినా వినకుండా"

'ఎందుకు ?'

"నాక్కూడా పిల్లలు పుడితే, నా పిల్లలతో సమానంగా వీడిగ్గూడా నా ప్రేమను పంచివ్వలేనోమోననే భయం. కన్న పిల్లల మీదున్న వాత్సల్యం వీడి మీదుండకపోవచ్చు. ఇది మన స్త్రీల సహజలక్షణం గదండీ! అందుకే ..!" సుగుణ బుగ్గల్లో

సింగారం గుబాళించింది.

సునీత సన్నజాజి నాసికమీంచి పుష్టిగా ఉన్న చెక్కిళ్ళ మీదికి జారుకుంటున్నాయేవో ఛావరేఖలు-రంగులు మారుతూ.

"ఎవరితో సుగుణా మాట్లాడుతుంది?" అన్నాడు అప్పుడే వచ్చి గడపలో చెప్పులు విడుస్తున్న రఘురాం- చిరునవ్వులు చిందిస్తూ.

సునీత కళ్ళల్లో జీవం శూన్యమైంది. క్షణకాలం రక్తం స్తంభించింది. దిగ్గువ లేచి నిల్చుంది-కలవరపాటుతో. మనసు మెలిపెడుతోంది. కనుకొలుకుల్లో నిలువనన్న నీటి బొట్లు నేలరాలి వెక్కిరిస్తున్నాయి.

